ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు


పుప్పాలగూడలో ఉపాధ్యాయులను సత్కరించిన కౌన్సిలర్‌లు, నాయకులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులను బోధించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా ఉపాధ్యాయులు పిల్లలుగా మారి నృత్యాలు చేస్తూ పిల్లలను అలరించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సన్మార్గంలో పయనించేలా చేసేవారే ఉపాధ్యాయులని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఖానాపూర్ గ్రామంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు.

- రాజేంద్రనగర్ జోన్ బృందం


మంచిరేవులలో ఉపాధ్యాయులను సత్కరించిన నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్


మహావీర్ కళాశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి


ఖానాపూర్‌లో ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


పద్మశాలిపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు


మణికొండలో ఉపాధ్యాయులను సత్కరించిన వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి


మండలంలోని పాల్మాకులలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవం


పిల్లోనిగూడ ఉపాధ్యాయురాలు బి.సరితను సన్మానిస్తున్న ఎంపీ, కలెక్టర్

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను పటిష్టం చేద్దాం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి కేవలం నాయకులు మాత్రమే పార్టీ మారారని పార్టీ కేడర్ అలాగే ఉందని.. వారితో పార్టీని మరింత పటిష్టం చేద్దామని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ ముఖ్యనాయకులు ఆమె నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి మున్సిపాలిటీ వారీగా నూతన కమిటీలను ఏర్పాటు చేసుకుని రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కొరకు కష్టపడే వారు ముందుకు వస్తే వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా దూళిపాల సీతారాంను నియమించాలన్నారు. త్వరలో మణికొండలోనే సమావేశం ఏర్పాటు చేసి అందులో మిగతా కార్యకర్తలు, పార్టీ అభిమానుల అభిప్రాయం తీసుకుని నిర్ణయం తీసుకుందామన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్.. వినియోగదారుల నాణ్యమైన ఎంపిక


తాపీ మేస్త్రీలకు కిట్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

శంషాబాద్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ మార్కెట్‌లోకి తీసుకొచ్చిన అల్ట్రాఫాస్ట్ వినియోగదారుల నాణ్యమైన ఎంపిక అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ అన్నారు. పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో ఉన్న గణేష్ స్టీల్స్‌లోని దుకాణంలో తాపీ మేస్త్రీలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. వేగవంతమైన నిర్మాణానికి భారతి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులు నిర్మాణాలను మంచి ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులను ఉచిత సాంకేతి సహాయాన్ని కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయాన్ని అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ రాజ్‌కుమార్, మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, టెక్నికల్ అధికారి బద్రీ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

రాజేంద్రనగర్: రెవెన్యూ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఈయూ) అధ్యక్షులు కె.శంకర్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను బదిలీ చేయడాని డిమాండ్ చేస్తూ గురువారం సర్కిల్ కార్యాలయం ముందు రెవెన్యూ సిబ్బందితో బీఎంఈయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎం.జయప్రకాశ్‌ను డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ప్రతి చిన్న విషయానికి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడగా ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. సర్కిల్‌లో జరిగిన టీడీఆర్ కుంభకోణంలో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ హస్తం ఉందని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయప్రకాశ్ అన్నారు. గతంలో ఇన్‌చార్జి ఏసీపీగా పని చేసిన కృష్ణ మోహన్, సెక్షన్ ఆఫీసర్‌గా పని చేసిన కబీరుల్లా ఖాన్‌లు సస్పెండ్ అయ్యారని.. ఈ విషయంలో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ప్రమేయం ఉందన్నారు.

– ఉప్పర్‌పల్లికి చెందిన సామ సంపత్ రెడ్డికి నాలుగు అసెస్‌మెంట్‌లు చేశారని... అయితే ఆయన ఎక్కడ కూడా బయటికి రాలేదన్నారు. గత ప్రభుత్వంలో మంత్రుల అండదండలతో ఆయన ఆడిందే ఆట... పాడిందే పాటగా కొనసాగిందన్నారు. ఈ నిరసనలో బీఎంఈయూ ఉపాధ్యక్షులు అశ్రఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శ్రీధర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు యాదయ్య, మహేందర్ గౌడ్, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు.

పని చేయనని చెప్పినందుకే నిరసన తెలుపుతున్నారు: డీసీ రవి కుమార్

రెవెన్యూ విభాగం అధిపతిగా ఉన్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏసీపీ)గా ఉన్న జయప్రకాశ్‌ను విధులకు హాజరు కాకుండా గైర్హాజరు అవుతుండటంపై ప్రశ్నించడంతో వేధింపులకు గురి చేస్తున్నారని చెబుతూ నిరసన తెలుపుతున్నారని డీసీ రవికుమార్ అన్నారు. ఉద్యోగుల నిరసనపై ఆయనను వివరణ అడగగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయప్రకాశ్ నాలుగు రోజులుగా విధులకు హాజరు కాలేదన్నారు. విధులకు ఎందుకు హాజరు కాలేదని అడగగా ఆసుపత్రికి వెళ్లాడని చెప్పాడని... సెలవు పెట్టవచ్చు కదా అని ప్రశ్నించగా తనపై కోపంతో ఇలా నిరసన తెలుపుతున్నారన్నారు.

మున్సిపాలిటీలను అభివృద్ధి చేద్దాం


వట్టినాగులపల్లిలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నాయకులు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించి సమగ్ర అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గొలిదొడ్డి, వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేటల పరిధిలోని వార్డులలో రూ. 10.10 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వాటిని గుర్తించి పనులను చేపట్టి పరిష్కరించినపుడే ప్రజలు హర్షిస్తారని న్నారు. మున్సిపాలిటీలలో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగణంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు పెద్దపీట వేసి నిధులను ఖర్చుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటీవ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ విలీనం వద్దంటూ ఎమ్మెల్యేకు విన్నపం

శంషాబాద్ రూరల్: మండలంలోని ఘాంసిమియాగూడ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని స్థానికులు గురువారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. జీఓ 111 కారణంగా ఇప్పటికే పంచాయతీ పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ, సాగుపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్.మహేందర్, నాయకులు ఆనంద్, జగన్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంప్లాయిస్ కాలనీ కార్యవర్గం

మణికొండ: ప్రజా సమస్యలను ఎప్పటికపుడు ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కాలనీ సంక్షేమ సంఘాలు కృషి చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ గురువారం కౌన్సిలర్ పి.శైలజ ఆద్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ కె. రామకష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నాయకులు బషీర్, శ్రావణ్‌కుమార్‌లతో పాటు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ చార్యులు, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌యాదవ్, కోశాధికారి ప్రేమ్‌కుమార్‌లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ధ్వంసం

మైలార్‌దేవ్‌పల్లి: పులిగుట్ట దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసి ఆభరణాలు, హుండీ డబ్బులను దొంగిలించారు. మైలార్‌దేవ్‌పల్లి సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మవారి వెండి కళ్లు, బంగారు ముక్కుపోగు, చేతికి ఉన్న గాజులను తీసుకెళ్లడానికి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని తెలిపారు. అమ్మవారి ముందు తవ్వకాలు సైతం జరిపారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గండి కొట్టారా? పడిందా?


కుంటనీరు వదలడంతో ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

- రోడ్లపైకి పారుతున్న వరద నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మామిడి కుంటకు గండి పడకుండా చూడాలని కోరుతున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహాడ్ ప్రాంతంలో ఉన్న మామిడి కుంట కొన్నేళ్లుగా కబ్జాకు గురైంది. కొంత మంది బడా నాయకుల అండదండలతో చెరవుకు గండి కొట్టి ఆ నీరును రోడ్లపై పారే విధంగా చేస్తున్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి అప్పచెరువులో నుంచి మామిడి కుంటలోకి వస్తుంది. ఆ కుంట నిండకుండా కొందరు గండి కొడుతున్నారు. దీంతో ఆ కుంటలోని నీరు వరదలా రోడ్లపై పారుతోంది. పక్కనే ఉన్న గోశాలలోకి నీరు వచ్చి చేరుతోంది. వాహనదారులు, పాదచారులు అటు నుంచి నడవలేని పరిస్థితి నెలకొంది. స్థానికులు అనేక సార్లు మామిడికుంటకు గండి కొట్టే విషయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. మామిడి కుంటలో అక్రమంగా ప్రహరీ నిర్మాణాలు చేయడానికి నీరు ఉంటే కుదరదు అని నీరు వచ్చిన వెంటనే గండి కొడుతున్నారు. అప్పచెరువు నుంచి మామిడి కుంటలోకి వస్తోంది. ఇక్కడి నుంచి జనవాసాల మధ్యకు నీరు వదులుతున్నారు. ఇప్పటికైన అధికారులు గుర్తించి మామిడి కుంటను కబ్జా కాకుండా వరద నీరు నిలిచిపోయి ఆ నీటిని చెట్లకు లేదా ఇతర వాటికి వాడుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


మామిడి కుంటకు గండి కొట్టడంతో రోడ్లపైకి వస్తున్న వరద నీరు

వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి

కార్పొరేటర్ నవాజుద్దీన్ హమీద్

అత్తాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని సులేమాన్ నగర్ కార్పొరేటర్ నవాజుద్దీన్ హమీద్ అన్నారు. ఎమ్మెల్సీ మీర్జార్ అహ్మద్ బేగ్ ఆదేశాల మేరకు సులేమాన్‌నగర్ ఎంఎం పహాడి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు కూలీలుగా జీవనం సాగించే నిరుపేద ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని సర్వం కోల్పోయిన బాధితులకు నిత్యవసరాలను అందించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారు ఆధైర్య పడకుండా ఉండాలని... పక్కా నిర్మాణాలు చేపించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


బాధిత కుటుంబాలను ఓదార్చుతున్న కార్పొరేటర్ హమీద్

వైభవం.. సీతారాముల కల్యాణం



మల్కారం గ్రామంలో గురువారం శ్రీసీతారాముల కల్యాణం వైభవం నిర్వహించారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో చేపడుతున్న సాకేత దీక్షలో భాగంగా గ్రామాల్లో స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్నారు. అందులో భాగంగా గ్రామంలోని జంటలు దీక్ష తీసుకుని కల్యాణంలో పాల్గొంటున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- శంషాబాద్‌రూరల్



రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10.30 గంటలకు ప్రారంభమైన భారీ వర్షం ఏకతాటిగా 45 నిమిషాల పాటు కురిసింది. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఉప్పర్‌పల్లి, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి, నేషనల్ పోలీసు అకాడమీ రోడ్డు, రాజేంద్రనగర్ యూనివర్సిటీ, గగన్‌పహాడ్, దుర్గానగర్ చౌరస్తా ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులతో పాటు లాండ్ అండ్ ఆర్డర్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి వరదనీరు వెళ్లేలా తగిన చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం సైతం భారీ వర్షం కురిసింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.